నేడు ఉచిత వైద్య శిబిరం

పద్మారావునగర్: ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ఈనెల 6న (నేడు) ఉదయం 8 గంటలకు ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు కె. బన్సీలాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతో ఖరీదైన బీఎండీ పరీక్షను ఉచితంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. నరాలు, తుంటి, మోకాళ్ల నొప్పులు, అలాగే వెన్నునొప్పి ఇతరత్రా సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 40, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 23, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 18, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

సనత్‌నగర్: అల్లంతోట బావి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫౌండర్ అధ్యక్షుడిగా గౌరపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా భట్టి శివకుమార్, ఎం.శ్రీరామ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జక్కుల కృష్ణ, జనరల్ సెక్రటరీగా కొమ్మిడి పద్మారెడ్డి, కోశాధికారిగా బూరుగు నర్సింగ్‌రావు, జాయింట్ ట్రెజరర్‌గా శరత్‌చంద్ర, లీగల్ అడ్వైజర్‌గా జయబాబురావు, జాయింట్ సెక్రటరీగా డేవిడ్‌రాజ్, మురళీకృష్ణ, సమీవుద్దీన్‌తో పాటు 12 మంది ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా, ఇద్దరు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లుగా ఎన్నికయ్యారు.

వృద్ధాశ్రమానికి సీనియర్ సిటిజన్స్ చేయూత


ఇన్వెర్టర్లు, ఫ్యాన్లు అందజేస్తున్న సభ్యులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ ది నెస్ట్ వృద్ధాశ్రమానికి చేయూతనందించారు. కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.54,350ల విలువైన రెండు ఇన్వెర్టర్లు, 5 సీలింగ్ ఫ్యాన్లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్‌రావు, సెక్రటరీ ఉమామహేశ్వరరావు, ఈసీ సభ్యులు వేణుగోపాలరావు, ఎంఎస్ఆర్‌మూర్తితో పాటు ఆశ్రమ నిర్వాహకులు అరుణకుమారి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హిందూ మహిళా కళాశాలలో ఫేర్‌వెల్ డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సనత్‌నగర్: స్థానిక హిందూ మహిళా కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థినులకు వీడ్కోలు పలుకుతూ జూనియర్స్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థినులు మహిళా లోకానికే వన్నె తీసుకువచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు చంద్రకళాయాదవ్, హెచ్ఎన్ త్రిపాఠి, హిందూ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది రోగులను పరీక్షించి పలు సలహాలు, సూచనలు అందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు నరసింహమూర్తి, వెంకటనారాయణ, నర్సింగ్‌రావు, నాగేశ్వర్ గుప్తా, రఘు, సతీశ్, జీహెచ్ఎంసీ ఏఎంసీ దయానంద్, గొల్ల కొమురయ్య కాలనీ అధ్యక్షుడు కేఎం కృష్ణ, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, వినోద్, మనీశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల వ్యాప్తంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, నాయకులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. బడుగు వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. అలాగే పలుచోట్ల అన్నదానాలు చేపట్టారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు


బేగంపేట పాటిగడ్డ ఎన్‌బీటీనగర్‌లో ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్..


శాంతినగర్‌లో అంబేద్కర్ యువజన సంఘం నేతలు


సీతాఫల్‌మండిలో కార్పొరేటర్ సామల హేమ


నివాళులర్పిస్తున్న ఎస్వీఐటీ కళాశాల ప్రతినిధులు..


అడ్డగుట్టలో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి..


పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో..


గాంధీనగర్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం..

శ్రీరామనవమికి సర్వం సిద్ధం

సీతారాముల కల్యాణానికి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

సనత్‌నగర్: నేటి శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే వివిధ కాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలోనూ వేడుకలు జరగనున్నాయి.

◆ సనత్‌నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు దేవస్థానం ఎదుట గల రాంలీలా మైదానంలో ప్రత్యేక పందిళ్లు వేయించారు. భద్రాచలంలో మాదిరిగా ముత్యాల తలంబ్రాల సమర్పణ, అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేయనున్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులకు భోజనం, ప్రసాద వితరణ చేయనున్నట్లు ఈఓ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు పలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, పిల్లలు, మహిళలతో కోలాటం, 10 గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు హనుమాన్ చాలీసా, 7 గంటలకు సనత్‌నగర్ వీధుల్లో స్వామివారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. 7న ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలుక కళావేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 7 గంటలకు సీతారామచంద్రస్వామి వారికి సామ్రాజ్యాభిషేకం మహోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.


విద్యుద్దీపాలతో అలంకరించిన సనత్‌నగర్ హనుమాన్ ఆలయం

◆ జెక్‌కాలనీలో సీతారాముల కల్యాణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7.20 గంటలకు ఒకటో వీధి నుంచి మూడో వీధి సన్‌రైజ్ పార్కు అపార్ట్‌మెంట్‌కు మంగళసూత్రం, తలంబ్రాలు తీసుకురానున్నారు. 9 గంటలకు ఒకటో వీధిలోని సిల్వర్ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్ నుంచి భక్తులు దేవతా విగ్రహాలను తీసుకురానున్నట్లు నిర్వహణ కమిటీ పేర్కొంది. ఉదయం 10.10 నుంచి కల్యాణం మహోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5.30 గంటలకు కాలనీ వీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామివారి ఊరేగింపు ఉంటుంది.

◆ బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ షాపర్‌స్టాప్ పక్కన అల్లావుద్దీన్ బిల్డింగ్ వద్ద కల్యాణం నిర్వహించనున్నట్లు అమరం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.


ముస్తాబైన రామలింగేశ్వర ఆలయం

◆ బేగంపేట అల్లంతోటబావిలోని శ్రీరామచంద్ర స్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు.

◆ సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ కాలనీలోని భగత్‌సింగ్ గ్రౌండ్‌లో శ్రీరామదాస ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, సుందర్‌నగర్‌లో సుందరభారతి కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో, మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీహాల్‌లో, రవీంద్రనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హాల్‌లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నారు.

ముస్తాబైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం రాత్రి 8 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు, ఈఓ జీ.శ్రీనివాసులు తెలిపారు. అలాగే భక్తులకు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

సీతారాముల కల్యాణానికి రండి

సనత్‌నగర్: నేటి సీతారాముల కల్యాణానికి హాజరుకావాలని కోరుతూ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను శనివారం పలువురు ఆహ్వానించారు. సనత్‌నగర్‌లోని హనుమాన్ ఆలయ పండితులు కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ప్రసాదాలు అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అదేవిధంగా జెక్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సుబ్బరాజు, సురేశ్‌గౌడ్, శ్రీహరి తమ కాలనీలో, అలాగే మోండా డివిజన్‌లోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే కల్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ ఆలయ ఈఓ అన్నారావు కోరారు.


ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సుబ్బరాజు తదితరులు

సీతారాముల ఉత్సవమూర్తులకు ఎదుర్కోళ్లు


సీతారామ ఉత్సవమూర్తులకు ఎదుర్కోళ్లు చేస్తున్న అర్చకులు

లాలాపేట:శాంతినగర్‌లోని సీతారామాంజనేయ దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కల్యాణానికి ముందుగా జరిగే ఉత్సవమూర్తులకు అర్చకులు ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు పలు పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నేతి రాములు, చైర్మన్ పంచముఖి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రామారావు, కోశాధికారి ఇంగు వెంకటేశం, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శి యెడ్ల రామారావు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదానం ఉంటుందని తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులతో దురుసు ప్రవర్తన

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కంటోన్మెంట్: విధి నిర్వహణలో ఉన్న ఎస్‌ఐపై ఓ వాహనదారుడు దాడికి యత్నించిన ఘటన బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బోయిన్‌పల్లి ట్రాఫిక్ పీఎస్‌కు చెందిన ఎస్ఐ విజయకాంత్ శనివారం మధ్యాహ్నం పుల్లారెడ్డి చౌరస్తా వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఓ బుల్లెట్ వాహనాన్ని ఆపి, ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి, ఫోకస్ లైట్లపై ప్రశ్నించాడు. దీంతో వాహనదారుడు పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడు. ఇరువురి మధ్య వాగ్వాదం తీవ్రం కావడంతో, ట్రాఫిక్ సిబ్బంది లా అండ్ ఆర్డర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బోయిన్‌పల్లి పోలీసులు అక్కడికి చేరుకుని షోయబ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న వాహనదారుడు

పిల్లలను గ్యాడ్జెట్లకు దూరంగా ఉంచండి

సాక్షి, సిటీబ్యూరో: పిల్లలు గ్యాడ్జెట్లకు దూరంగా ఉండేలా చూడాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. బంజారాహిల్స్ రెయిన్‌బో పిల్లల ఆస్పత్రిలో ఆటిజంపై 2 రోజుల జాతీయ సదస్సు ముగింపులో శనివారం ఆయన మాట్లాడారు. పిల్లల జీవితంలో మొదటి వెయ్యి రోజులు చాలా కీలకమని తెలిపారు. ప్రతిరోజూ పిల్లలు కనీసం పది వేల పదాలు వినేవిధంగా చూడాలని సూచించారు. ఆటిజం అనేది దీర్ఘకాలిక వ్యాధి అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. రెయిన్‌బో పిల్లల ఆస్పత్రి వైద్యులు బీవీ రామ్‌కుమార్, లోకేష్ లింగప్ప, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీడియాట్రిక్ న్యూరాలజిస్టులు, చైల్డ్ సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు, థెరపిస్టులు, స్పెషల్ ఎడ్యుకేటర్లు సుమారు 250 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఓయూలో ముగిసిన సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కొనసాగుతున్న అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు శనివారం ముగిశాయి. ఠాగూర్ ఆడిటోరియంలో రెండు రోజులు పాటు జరిగిన పోటీల్లో భారతీయ, పాశ్చాత్య, జానపద సంగీతం మూడు విభాగాల్లో బృందగానం, సోలో, భారతీయ, వెస్ట్రన్, జానపద కళారీతులతో విద్యార్థులు సృజనాత్మకతను చాటుకున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన అభ్యర్థుల జాబితాను వచ్చే వారం ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. బహుమతులను ఈ నెల 26న ఓయూ ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రదానం చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

జమిలి ఎన్నికలతో సమయం, ఖర్చు ఆదా

రాంగోపాల్‌పేట్: దేశంలో జమిలి ఎన్నికల నిర్వహిస్తే సమయం, ఖర్చు ఆదా అవుతుందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తాజ్ త్రిస్టార్‌లో వివిధ వ్యాపార వర్గాలతో జమిలి ఎన్నికలపై శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ఐదేళ్ల పాటు ఎక్కడో ఓ చోట ఎన్నికలు జరుగుతుండడంతో ప్రధానమంత్రికి అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే సమయం ఉండడం లేదన్నారు. జమిలి ఎన్నికల ద్వారా 6 నెలల్లోపు అన్ని ఎన్నికలు పూర్తవుతాయని, తద్వారా మిగితా సమయం మొత్తం దేశం కోసం ఆలోచించే అవకాశంతో పాటు ప్రభుత్వానికి ఖర్చు కూడా తగ్గుతుందని అన్నారు. పదేళ్లలో ఎన్‌డీఏ పాలనలో ఏ కార్యక్రమం చేపట్టినా అది ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేసిందేనని కానీ ప్రతిపక్షాలు ప్రతిదానిని రాద్ధాంతం చేయడమే తప్పా మరేమి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, మహంకాళి జిల్లా పార్టీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, కార్పొరేటర్ చీర సుచిత్ర, నాయకులు చీర శ్రీకాంత్, రాజశేఖర్‌రెడ్డి, హరి, నందు తదితరులు పాల్గొన్నారు.

15న ఓయూలో జార్జిరెడ్డి సంస్మరణ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి, పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి సంస్మరణ సభను ఈనెల 15న నిర్వహించనున్నట్లు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ తెలంగాణ అధ్యక్షుడు డా.ఎస్ నాగేశ్వర్ రావు తెలిపారు. ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. జార్జిరెడ్డి స్ఫూర్తితో ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి పోరాడాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 5 నుంచి 15 వరకు జార్జిరెడ్డి అమరత్వం యాదిలో పేరిట సంస్మరణ సభలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుమంత్, బాలికల కన్వీనర్ కె.స్వాతి, సహాయ కార్యదర్శి మందా సురేశ్, ఓయూ నాయకులు రుక్మత్ పాషా, సతీశ్, సంతోష్, కాంత్రి, తిరుపతి, రంజిత్, శ్రీను, గ్రేటర్ నేత వెంకటేశ్, కార్యదర్శి కోటేశ్వర్ పాల్గొన్నారు.

వర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకాలపై నిర్లక్ష్యం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల భర్తీపై సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ డాక్టరేట్స్ అసోసియేషన్ నాయకులు డా.నరేందర్ రెడ్డి, డా.ద్వాత్రిక స్వత్న శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 4న రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు, వీసీ, విద్యా కమిషన్ చైర్మన్, ఇతర విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించకపోవడం బాధకరమన్నారు. ఓయూలో 14 ఏళ్లుగా అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంతో పర్మినెంట్ ప్రొఫెసర్లు కేవలం 200 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ల కొరతతో పీహెచ్‌డీ పరిశోధనలు సైతం కుంటుపడ్డాయన్నారు. ఇప్పటికైనా అధ్యాపకుల ఉద్యోగాల భర్తీపై సీఎం చొరవ చూపాలని కోరారు.

వాజ్‌పేయిది నైతిక విలువలతో కూడిన రాజకీయం

అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: సిద్ధాంతాలు..నైతిక విలువలతో కూడిన రాజకీయాలతో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు అమోఘమైనవని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పద్మారావునగర్ కొతాకామకోటి కల్యాణ మండపంలో శనివారం రాత్రి జరిగిన అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వాల్మీకి ఆవాజ్ యోజన పథకం ద్వారా నగరంలో పేదలకు వందలాది ఇళ్లు కట్టించిన ఘనత ప్రధానమంత్రిగా వాజ్‌పేయికే దక్కుతుందన్నారు. నీతివంతమైన సుపరిపాలన అందించారని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. సడక్ యోజన పథకం ద్వారా వాజ్‌పేయి ఎన్నో మారుమూల ప్రాంతాలకు రోడ్లు వేయించారని గుర్తుచేశారు. మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కన్వీనర్ మేకల సారంగపాణి, వెంకటరమణి, సదానంద్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, టి. రాజశేఖరరెడ్డి, బంగారు శృతి, రామ్ రమేశ్, వాజ్‌పేయి మనుమరాలు ప్రాచీశుక్లా, కార్పొరేటర్లు కొంతం దీపికా, సరిత, నాయకులు మహేశ్, శారద, హరినాథ్ నాయి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి